

# ఆఖరిముద్దు

సాయంత్రం అయిదున్నరకావస్తోంది...

“ఎక్స్‌క్యూజ్‌మీ సర్... సంచార్ కోరియర్ సర్వీస్ మాది. సుదర్శనం పేరు మీద పర్సనల్ లేటర్... మద్రాస్ నించి....

పేపర్ చదువుతున్న శశిధర్ ఆశ్చర్యంగా చూసాడు ఆ వ్యక్తివైపు. కాఫీ తాగుతున్న సువర్చల అంతకన్నా ఆశ్చర్యంగా చూసింది. పిల్లలు బాల్కనీలో ఆడుకుంటున్నారు. మొక్కలకు నీళ్ళు పడుతున్న సుదర్శనం వృద్ధ మనసు నిమిషం పాటు లయ తప్పి కొట్టుకుంది. ఈ వయసులో తనకు పర్సనల్ లేటరేంటి? అందులోనూ కొరియర్ సర్వీస్ ద్వారా పంపేటంత పర్సనలా? భార్య పోయిన పన్నెండేళ్లనించి కొడుకూ, కోడలూ వాళ్ల పిల్లలూ, ఈ పూల మొక్కల మధ్యే బంధీగా బతుకుతున్న తనకి ఉత్తరం రావటం?

చేతిలోని నీటి గొట్టాన్ని మొక్కల మధ్యే వదిలేసి వచ్చి సంతకం చేసి లెటర్ తీసుకున్నాడు. 'ఫ్రమ్' అడ్రస్ చూసాడు.

'సాగరిక.... మద్రాస్'

ఎక్కడో మనసు అట్టడుగు పొరల్లో ఫెటేల్మన్న విస్ఫోటనాలు.... గుండె బ్లోఅవుట్‌గా మండి కళ్లగోడల్ని తాకితే తడితో·నిండిపోయాయి.

మౌనంగా అతడు ఇంట్లోకి నడుస్తుంటే... 'ఎక్కడిది నాన్నా.... ఉత్తరం?' అని అడిగాడు కొడుకు శశిధర్.

సుదర్శనానికి మాట కూడా పెగల్లేదు....

నిశ్శబ్దంగా తన గదిలోకి వెళ్లాడు....

ఈ వయసులో పర్సనల్ లెటర్సేంటీ? కొంపదీసి అరవైలో ఇరవై కాదు గదా..." వెటకారంగా వచ్చిన కోడలి మాటకు మనసు గిలగిల్లాడింది.

గది తలుపులు వేసుకొని వాలు కుర్చీలో కూలబడి కళ్లు మూసుకున్నాడు.

సాగరిక....

మనసు పలవరిస్తోంది. ఆ రూపం మనోఫలకం మీద స్పష్టతని సంతరించుకోడానికి చిత్రకారుడి తపనలా తాపత్రయం పడుతోంది.

బయట కొడుకూ... కోడలు సుదర్శనం గదివైపు విచిత్రంగా చూసారు.

గదిలో సుదర్శనం జాగ్రత్తగా కవర్‌ని చించాడు.

'సుధీ...'

బావున్నావా?

ఈ పిలుపు ఎన్నేళ్ళ కిందటిదో గుర్తొచ్చిందా... కాలువ గట్టు గుర్తురాలేదా? జామచెట్టు మర్చిపోయావా? నువ్వన్నీ మర్చిపోయినా... నా జీవితాన్నే మార్చేసిన నీ 'తొలిముద్దు' ని ఏనాడు మర్చిపోలేదు. అందుకే ఈ చివరి దశలో కూడా ఆ అనుభూతిని నీతో పంచుకోవాలని.... నీకోసం దాదాపు రెండొందల అడ్రస్‌లు సేకరించి కొరియర్ ద్వారా ఈలేఖ పంపుతున్నాను. అందితే అదృష్టవంతురాల్ని.

పదిహేనేళ్ల వయసులో రోజురోజుకీ కొత్తగా ఉబికుబికి వస్తున్న గుండెల్ని చూసుకుంటే ఏదో సిగ్గు, ఏదో భయం ముంచుకొచ్చేది. స్కూల్‌కెళ్లి వచ్చే టైమ్‌లో నువ్వెక్కడ అటువైపు చూస్తావేమోనని బెరుగ్గా పుస్తకాల్ని 'ఓణీగా' వాటిని కప్పుకుంటూ చిల్వాకోడూర్ వాగు బ్రిడ్జి దాటుతుంటే... నువ్వటువైపు చాడాలని కూడా ఆశపుట్టేది.

స్కూల్ నించి వస్తూ రోజూ కాలువగట్టుమీది జామచెట్టు దగ్గరే నోట్సు రాసుకునేవాళ్లం. నువ్వు చెట్టెక్కి జామకాయలు కోస్తే దారెంట వాటిని కొరుక్కుతింటూ పదవ తరగతి పరీక్షలు దగ్గరపడుతున్న భయాల్ని ఒకరికొకరం చెప్పుకునేవాళ్లం.

ఆరోజు చివరి పరీక్ష రాసివస్తూ జామచెట్టు చిటారుకొమ్మల్లో వున్న జామకాయల్ని నువ్వు కోసి కిందపడేస్తే రెండు కాయలు కాలువలో పడ్డాయి. నువ్వు చెట్టు దిగాక 'ఆరుకాయలు తెంపితే నాలుగే వున్నాయ్... ఇంకరెండేవి?" అని నువ్వు పోట్లాటకు దిగావ్. 'కాలువలో పడ్డాయంటే' వినకుండా...' నువ్వే తిన్నావేమోనని నన్ను ఎగాదిగా చూస్తుంటే... అప్పుడు పడింది నీ దృష్టి అక్కడ.....

'దొంగా... జాకెట్లో దాచుకున్నట్టున్నవ్? అమాయకంగా, కోపంగా అడిగిన నీ ప్రశ్నకు నవ్వు, సిగ్గు కలగలిపి వచ్చిన అనుభూతి మర్చిపోనిది.

'అవేం కాదు...' అని చెప్పినా వినకుండా మీద పడ్డావ్. ఒక్కసారిగా ఆ స్పర్శకి నీలో మొగ్గతొడిగిన సిగ్గు నాకింకా గుర్తుంది. జామకాయలు మర్చిపోయి... నాచేయి నీచేయి నొక్కితే అప్పటివరకూ తెలియని ఏ పురుష స్వభావమో రెక్కలు విరుచుకొని.... నా బుగ్గల మీద నీ అధరాల స్పర్శ....

నాకింది పెదవి కొరికి 'జామచెట్టుకి థాంక్స్' అంటే పెదవి చిట్లి నేను బాధగా మూలిగాను. ఆకోపంలో నీ బుగ్గకొరికి గుండెలకు హత్తుకున్నప్పుడు.... ఎప్పుడొచ్చాడో తెలియని మామయ్య 'సాగరిక' అని హుంకరించినప్పుడు చెరో దిక్కుగా పారిపోయాం.

ఆ తర్వాత రెండు రోజులు ఇంట్లో నన్ను చిత్రహింసలు పెట్టారు. ఆ బాధలు భరించలేక ఇంట్లోంచి పారిపోయాను....

ఇంకా పెరుగుతున్న నా గుండెల మీద నాకే కసి మొదలైంది. అందుకే పారిపోయి మద్రాస్ సిటీలో మొదటిసారిగా ఓ లైట్‌బాయ్‌కి వాటినందించాను. వాడు ఓ స్టిల్ ఫొటో గ్రాఫర్‌కి పరిచయం చేసాడు. వాడు అందంగా వాటిని కెమెరాల్లో

బంధించాడు. వాటిని ఓ కో-డైరెక్టర్‌కి పరిచయం చేసాడు. మొదటి మళయాళీ చిత్రం విడుదలయ్యాక... ఆ పొంగులు చూసే ప్రొడ్యూసర్స్ నించి ఫోన్స్ రావడం మొదలయ్యాయి. ఆ తర్వాత అనూహ్యంగా నాలుగేళ్లలో 'మోనిక' గా అవతారమెత్తాను.

వెండితెర మీద బంగారు బొమ్మలా ఎదగడానికి పాదరసంలా నా యవ్వనాన్ని ధారబోసాను.

ఇక్కడ ప్రతివాడు శరీరాల్తో ఆడుకునేవాడే... ఏ అనుభూతి లేకుండానే అర్పించుకునే దాన్ని. నేనే కాదు ఇక్కడ చాలామంది ఇంతే! బాగా త్రాగినప్పుడు మాత్రం నువ్వు గుర్తొచ్చేవాడివి. కాలువగట్టు గుర్తొచ్చేది. భోరున ఏడ్చేదాన్ని, జీవితంలో పదిలంగా దాచుకున్న 'తొలిముద్దు'ని ఆనాటి అనుభూతిని ఇన్నేళ్లుగా పదిలంగా గుండె పొరల్లో నిక్షిప్తం చేసుకొని.... సినీ శిఖరం మీద వేలసార్లు పడక సుఖాన్నిచ్చినా అది కేవలం నటిగా ఎదగడానికే తప్ప.... ఆనాటి అనుభూతిని ఒక్కసారి కూడా పొందలేదంటే నమ్మ...

శృంగారం అనేది శరీరానికి కాదు.... మనసుకి ముఖ్యం అన్నది నిజమే! లేకపోతే నా జీవితంలో చూసిన వందలాది మగాళ్ల తర్వాత నువ్వింకా గుర్తుండేవాడివి కాదు.

సుధీ....

ఎన్నోసార్లు జడంగా శృంగారాన్ని అనుభవిస్తుంటే విసుక్కునే మగాళ్లకోసం మూలుగులతో నటించేదాన్ని. సెక్స్‌లో కూడా నటించటం ఎంత దుర్లభం?!

నిజమైన అనుభూతిని మనసు కోరుకున్నప్పుడు మాత్రం ఒంటరిగా...

కళ్లు మూసుకొని నీ తొలిముద్దు జ్ఞాపకాల్ని పెకిలించుకుంటూ గడిపేదాన్ని....

...తో ... విషయం చెప్పనా....

'తొలిముద్దు' చిత్రానికి నాకు జాతీయ అవార్డ్ ఎలా వచ్చిందో తెల్సా? ఒక ముద్దు సీన్‌లో నా ఫీలింగ్స్‌కి పడ్డ మార్కులకే. నిజానికి ఆషాట్‌లో ఎన్నో టేకులు తిన్న నేను డైరెక్టర్ చిరాకుపడుతుంటే... చివరిసారిగా గుండె లోతుల్లోని ఆనాటి మన 'తొలిముద్దు' అనుభూతిని పెకిలించుకొని ఆ షాట్‌లో జీవించడమే!

అందుకే ఆ అవార్డ్ అందుకొన్న సమయంలో నాకు ఒక్కసారిగా కాలువగట్టూ, నువ్వూ, జామచెట్టూ అన్నీ గుర్తొచ్చి కళ్లలో నీళ్ళు చిమ్మాయి.

ఇప్పటికీ ఆ అవార్డ్‌ని చూస్తే గుర్తొచ్చేది నీ తొలిముద్దే!

గాఢంగా ఆస్వాదించడం తెలిస్తే, కల్లోల మనసుకి అనుభూతులు పూయించడం నేర్పితే పరిపూర్ణ శిఖరాలు చేరడానికి శృంగారం కూడా మెట్టు అని నాకనిపిస్తుంది.

ఆనాడు సరసం విరసమైందేమోననుకున్నాగాని... ఆ అనుభూతే నన్నిప్పటి వరకూ బ్రతికిస్తోందని చెప్పడానికే ఈ చివరిదశలో నీకీ ఉత్తరం రాస్తున్నాను.

సుధీ... జీవితం ఎంత విచిత్రమైంది?

నువ్వు భార్యాపిల్లల్తో నన్నెప్పుడో మర్చిపోయుంటావ్? నావృత్తిలో పెళ్లి ఒక ట్రాష్ కాబట్టి నేను మాత్రం జ్ఞాపకాల్తోనే బ్రతుకుతున్నాను. నా జీవితపు చివరి సీనులో గుర్తొస్తున్న నీకూ...కృతజ్ఞతా వందనాలతో

నీ... సా..క ఉరఫ్ మోనిక

సుదర్శనం ఉత్తరం ముగించి భారంగా నిట్టూర్చాడు. కళ్ళద్దాల మాటున పొంగిన కన్నీళ్లు తుడుచుకోడానికి ప్రయత్నిస్తుంటే తలుపు తోసుకొని వస్తూ 'తాతయ్యా... అమ్మ భోజనానికి రమ్మంటుంది.' అంటూ వచ్చాడు బాబీ.

నిశ్శబ్దంగా డైనింగ్ టేబిల్ దగ్గరకొచ్చి కూచున్నాడు. కొడుకూ, కోడలు ఓరగంట సుదర్శనాన్ని గమనిస్తున్నారు. గడియారం ముల్లు ఎనిమిది దాటుతోంది.

టీవీలో తెలుగు వార్తలొస్తున్నాయి.

అన్నం కెలుకుతున్న సుదర్శనాన్ని కొడుకు అడిగాడు.

"ఉత్తరమెక్కడిది నాన్నా?"

సుదర్శనం మాట్లాడలేదు. తినటం మర్చిపోయి ఒక్కసారిగా టీవీ స్క్రీన్ వైపే చూస్తుండిపోయాడు నిర్వేదంగా...

టీవీ తెరపై సాగరిక బొమ్మ...

ఎనౌన్సర్ మాట వినిపిస్తోంది.

"ప్రముఖ నటి, జాతీయ అవార్డ్ గ్రహీత మోనిక ఈ ఉదయం గుండెపోటుతో మరణించారు. ఆమె వయసు ఏభై రెండు సంవత్సరాలు. ఆమె నటించిన ఎన్నో చిత్రాలు విజయవంతమయ్యాయి. కాగా రాష్ట్ర ప్రభుత్వం మోనిక మరణానికి మూడు రోజులు సంతాప దినాలుగా ప్రకటించింది."

సుదర్శనంకేమీ వినపడట్లేదు.

"మూడు రోజులు సంతాపదినాలా... అయితే రేపు సెలవు ప్రకటిస్తారేమో..." కోడలు గట్టిగా అంది. ఆమె మొహంలో ఏదో ఆనందం.

"అయితే నేను రేపు జురాసిక్ పార్క్ సిన్మాకెళ్తాను" బాబీగాడు డైనింగ్ టేబిల్ ముందు గంతులేస్తున్నాడు.

"అదేం కాదు నాగార్జున సిన్మాకేళ్దాం" చిన్నిగాడు పోట్లాట మొదలెట్టాడు.

"ఏవండీ... రేపు నాకు ఆఫీసుండదు కదా! మహిళా మండలి మీటింగ్ కెళ్తాను. మీటింగ్ అటెండవక రెన్నెళ్లయింది. మెంబర్స్ నామీద గుసగుసలు పెడతారు" అంది కోడలు సువర్చల.

"సరే... ఎవరెటు వెళ్ళినా నేను మాత్రం రేపు కాళేశ్వరం గుడికెళ్తాను." అన్నాడు శశిధర్.

"ఎందుకు... భక్తి పొంగుకొచ్చిందా? గోదావరి అవతలి ఒడ్డుకు వెళ్లి మధ్యప్రదేశ్ విస్కీ తాగి రావడానికా? మీరటు వెళ్తే బావుండదు...." అంది కోడలు చిరాగ్గా.

సుదర్శనానికి వీళ్ల మాటలు కంపరం పుట్టిస్తున్నాయి.

టీవీలో సాగరిక నటించిన క్లిప్పింగులు చూపిస్తున్నారు. మనసంతా చికాకుగా మారింది. ఏమీ తినకుండానే పళ్లెంలో చేయి కడిగి లేచి గదిలోకి వెళ్లాడు.

"ఒక్కరోజు సెలవొస్తే ఆనందంగా ఒక్క ప్రోగ్రాం వేసుకోనివ్వరు. ఆ ముసలాయనకి ఇంటిపట్టున వుండడానికేం? అలా చిరాగ్గా వెళ్తున్నాడు" కోడలు కొడుకు మీద గయ్‌మంది.

శశిధర్ మాట్లాడలేదు. మళ్లీ కాసేపటికి ఎవరి ప్రోగ్రాం వారు వేసుకోవటంలో నిమగ్నమైపోయారు. సుదర్శనం మనసు శూన్యంగా మారింది.

బెడ్‌లైట్ కాంతిలో సాగరిక ఆలోచనల మధ్య నిద్ర చాలాసేపటికి పట్టింది.

*** **** ****

తెల్లారింది.....

అలవ్యంగా నిద్రలేచిన సుదర్శనానికి కొడుకు, కోడలు చిరుబురులాడుతూ తయారవుతున్నట్టు కన్పించింది.

"ఏమిట్రా?" శశిధరాన్ని అడిగాడు సుదర్శనం.

"టీవీ వార్తలు విన్లేదా నాన్నా....

"అంత గొప్పనటి చచ్చిపోతే సంతాపదినాలు ప్రకటించారుగాని... కనీసం సెలవ్ ప్రకటించలేదు. అసలేం ప్రభుత్వమో ఇది" హడావిడిగా ఆఫీస్‌కి తయారవుతూ అరిచాడు శశిధర్.

"అసలీ ప్రభుత్వాలకు కళలన్నా... కళాకారులన్నా ఎక్కడ గౌరవముంది? ఒక గొప్పనటికి ప్రభుత్వం ఇవ్వాల్సిన మర్యాదేనా ఇది?" కోడలు టిఫిన్ బాక్స్ సర్దుకుంటూ ఆఫీసుకి ఆరాటపడుతోంది.

బాబీగాడు సెలవు లేనందున ఏడ్చుకుంటూనే స్కూల్ వ్యాన్ ఎక్కాడు.

"నాన్నా... మరో అరగంట తర్వాత చిన్నిగాన్ని స్కూల్లో దింపేసి రండి. ఒక మహానటి చావుకు సెలవు ప్రకటించనందుకు, ఒక కళాకారిణి పట్ల చిన్నచూపు చూసి కళని అవమానపర్చినందుకు తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఒక యూనియన్ లీడర్‌గా నేను పత్రికా ప్రకటన ఇవ్వాలి. నే వెళ్తున్నా..." అంటూ శశధర్ వేగంగా వెళ్లిపోయాడు.

"మామయ్యా... అందులో టిఫిన్ ఉంది. తినండి. నాకు ఆఫీసుకు

లేటయ్యింది. ఆ మహానటి మీద అభిమానం ఉంటే ప్రభుత్వం సెలవిచ్చి ఉండేది. ప్చ్... సరేకాని... తలుపేసుకోండి..." కోడలు వెళ్లిపోయింది.

గొప్ప వ్యక్తులు చనిపోయారంటే ఉద్యోగస్తులకి సెలవు మీద ప్రేమ.

సుదర్శనానికి నవ్వొచ్చింది.

టీవీలో నేషనల్ నెట్‌వర్క్‌లో సాగరిక గురించి ప్రసారం చేస్తున్నారు.

అలాగే చూస్తుండిపోయిన సుదర్శనానికి సాగరిక చిన్ననాటి ఫోటో స్క్రీన్‌మీద కన్పించింది.

పదోతరగతిలో దిగిన ఫోటో... ఆనాటి సాగరిక!!

ఒక్కసారిగా కాలువగట్టూ, జామచెట్టూ గుర్తొచ్చాయి.

వయసుని కూడా మర్చిపోయి చప్పున టీవీ స్క్రీన్‌ని ముద్దెట్టుకున్నాడు.

"అదేంటి తాతయ్యా... బిన్‌లాడెన్‌ని ముద్దెట్టుకుంటున్నావ్?" నిమిషం తర్వాత చిన్నిగాడి మాటకు ఉలిక్కిపడి ఈ లోకంలోకొచ్చాడు.

"అవున్రా... నేను కూడా మృత్యువుని ప్రేమిస్తున్నాను కాబట్టి..." సుదర్శనం గొణుక్కుంటూ తన గదిలోకి వెళ్లిపోయాడు భారంగా....

* * *